


# ఆశ

-డా. ఎన్. శైలజ

చూరు నుంచి చుక్కచుక్కగా కారుతోంది వాన నీరు.

తుపాను వెలిశాక కూడా వచ్చే చినుకు పోయే చినుగ్గా ఉంది. తడిసిన గుడిసెల పైన నల్లమబ్బులు కమ్మేసిన ఆకాశం. వానజల్లు, పాకల్లోంచి పైకెగసే పొగ, సాయంత్రం చీకటి దిగులు ముసిరినట్లున్న ఊరి చివర కాలనీ.

గుడిసె అరుగు మీద మోకాళ్ళలో తలపెట్టుకొని కూచుంది ఆదెమ్మ. కళ్ళు ఎర్రగా బరువుగా ఉన్నాయి. ఆ వాతావరణం ఆమెనింకా దుఃఖంలోకి తోస్తూ బరువుగా అలముకొన్నట్లుంది.

దూరాన నల్లాకాశంలాగా సముద్రం కన్పిస్తోంది. ముసురువానలా సముద్రం హోరు దిగులు శబ్దంగా మారితే ఎలా ఉంటుందో అలానే ఉంది. రోజు నీలంగా ఆదరంగా పలకరించినట్టుండే సముద్రం యిట్టా ఉంటుందనుకోలేదు. ఆ సముద్రం ఆమె గుండెలోని బెంగలా ఉందివ్వాళ. యీ ఊరొచ్చిన కొత్తల్లో మడచెట్లు అడ్డమొచ్చి కన్పించేదికాదు. అలా అలా కలపకని, వంటకని తెచ్చేస్తుంటే (చెట్లు తరిగిపోయి) సముద్రం యింటికాడికి కన్పిస్తాంది. ఆ తోట వెంట బురదలో చిన్న కాలవ చేసుకొని నావల్లో వెళ్ళేవాళ్ళు వెన్నెల్లో తనూ వెంకటేశూ.

ఆ రోజప్పుడే ఐదోరోజు. ఎవరేటి చెప్తే అదే చేస్తోంది. యీ దినాలు కార్యాలప్పుడు తప్ప మామూలప్పుడు ఎప్పుడూ ఎవరూ మాటాడుకోరు. ఎప్పుడు ఆకాశంలోంచి పిడుగుపడ్డట్టు వచ్చిపడ్తాయి చావులు ఒక్కోయింట్లో! అప్పుడు అలా చెయ్యాలి, ఇలా చెయ్యాలని ఎవరో చెప్తుంటారు. ఎవరో చేస్తుంటారు. అసలు వాళ్ళకు ఏమీ సంబంధం ఉండదు.

సాయంత్రం పలకరించడానికి పక్క ఊరు పంతులమ్మ వచ్చింది, కాలనీ మహిళా మండలి ప్రెసిడెంట్‌తో. ఆమె మాటలే కొత్తగా పదేపదే విన్పిస్తున్నాయి. ఇంత పెద్ద తుపాను ఎప్పుడూ రాలేదట. ఏటో, రొయ్యల చెరువులకని మడచెట్ల అడవుల్నీ తీరం పొడుగూనా కొట్టేసేరట, అందుకే వచ్చిపడ్డదట తుపాను. ఎప్పుడు తుపాను ధాటిని బురదలో పెరిగే చెట్లు గుంపులు గుంపులుగా ఉండి తగ్గిస్తాయట.

ఏటో! చదుకున్నోళ్ళు వేలికి కొండ ముడేస్తారు. తుపానుకు తెల్సా ఏటి వాళ్ళు చెట్లు కొట్టేసారని వచ్చి మీదన పడదామని?

కానీ ఏటో ఇందులో తెలీని సంగతేదో ఉన్నట్లే ఉంది. నా చిన్న బుర్రకి అర్థం కావడం లేదంతే అనుకుంది ఆదెమ్మ.

సత్తిగాడు ఇంకా రాలేదు. తెల్లవారుఝామునగా వెళ్ళాడు. కొడుక్కోసం ఏదో ఆదుర్దా ఆదెమ్మను కలిచివేస్తోంది. సీ! ఎదవ బతుకు ఎంత యీదినా యింతే! ఆడు మారాజులా పోయాడు! నా మీద యిన్నీ వదిలేసి. గుండెలోంచి దుఃఖం తన్నుకొచ్చింది.

ఆరోజు తుపాను హెచ్చరిక విన్లేదు. ఆ రాత్రి పదకొండుగంటలకి రాయుడు మడుషులు వచ్చి పిలిస్తే లేచి వెళ్ళాడు వెంకటేసు. బోటు లోడేసకొని కాకినాడ ఏటిమొగకి పంపాలని. అంత రాత్రి చీకట్లో ఎళ్ళి పోయాడు వెంకటేసు. తెల్లారేసరికి ఊరూవాడ ఏకమయ్యేలా వాన. సముద్రమంతా అలికేసినట్లయిపోయింది. రాత్రి ఎల్లినోళ్ళు ఏమయ్యారో తెలీలేదు. మూడోరోజు కబురు. నాటుసారా తీసుకుపోయిన పడవ బరువుకి మునిగిపోయిందని. ఆడితో ఎల్లిన జాలాది రాజన్న తిరిగివచ్చాడు. వెంకటేశుకి యీత అంతంత మాత్రమే. యీ పాడు సారా ఆడిని పొట్టన పెట్టేసుకొందా!

యానాం శివారు గ్రామాలు సగం సముద్రంలోకి చొచ్చుకపోయినట్లుంటాయి. ఆంధ్రా అంతా మద్యనిషేధం. ఊరి పెద్దలికి యిలా నాటుసారా కాయించి చుట్టుపక్కల ఊళ్లకు పంపడం పెద్ద బిజినెస్. పందగసీజనని పట్టేదానికన్నా ఎక్కువ లోడేసేసారు. ధానికి తోడు వెంకటేశు కాస్త చుక్క ఏసుకొన్నాడు. ఎంత అన్యాయం! సముద్రంలోకి ఎతకడానిక్కూడా ఎవర్నీ పంపలేదు. పోలీసులకీ చెప్పలేదు. ఎక్కడ ఆళ్ళీ వ్యాపారం గుట్టు బయటపడుతుందోనని.

పుట్టినూళ్ళో గడవడం లేదని యిక్కడి కొచ్చిపడ్డారు. ఆగుంపుతో ఎక్కడో పరిచయమయింది వెంకటేసుకి. అలా అలా ఆ చుక్క యిస్తారన్న ఆశతో ఆ నాటుసారా కాసే పన్లో కుదిరాడు. బతుకప్పట్నుంచి ఎప్పుడూ భయమే, ఎవరైనా సారా పోలీసులొస్తే యింట్లో లేకుండా పోయేవాడు. అసలు పెట్టుబడిదారుడు పెద్ద రాయుడుగారు ఎప్పుడూ కన్పించడు. మధ్యన యీ చిన్నాచితక దారికి పోయి తన్నులు కాసి జైలుకెళ్లి బతుకులు బుగ్గి చేసుకొంటారు. ఏదో ఆశ ఇల్లు గడుస్తుందన్న ఆశ! రోజులు మారతాయన్న ఆశ. సత్తిగాడినన్నా చదివించాల మంచి గొప్పోణ్ణి చెయ్యాలన్న ఆశ. ఆడు అలా పన్లో చేరినా ఏమీ అనలేకపోయింది. ఆ పని తప్పే! రోజురోజూ మెతుగ్గడవనోళ్ళు నీతుల్లో గీతల్లో బతకాలనుకొంటే గడవదు.

ఎండనక వానక ఆ సముద్రం పాలి బురదలో తొక్కుకొంటు జారుకొంటూ ఒళ్ళు పులిసేలా యాభైలీటర్ల సారాకాన్లు మోసేటప్పటికి ఆడు సున్నమయిపోయేవాడు. ఎక్కువ ఒడ్డున తనే కాపుపెట్టడం, సారా కాసులు మొయ్యడం , ఎప్పుడన్నా బోటులోడుతో కాకినాట, ముమ్మిడివరం, అమలాపురం ఎల్లి దించి రావడం. పోయినపాలి ఆడి మీద అనుమానం వచ్చి పోలీసులు తీసుకుపోయి కుళ్ళబొడిచేసారు. యిక జల్మలో ఆ పనికెళ్ళదని ఒట్టేయించుకొన్నాది ఆదెమ్మ. అయినా పనుల్లేవు చెయ్యడానికి, లోపల కవుకు దెబ్బలు తగ్గవు వళ్ళంతా తీపులు, మందులకి డాక్టరుకి ఎక్కణ్ణుంచి తీసుకురావాలె డబ్బు! ఆడి మందు క్కూడా డబ్బెక్కణ్ణుంచి తేవాలి! మళ్ళీ అదే పన్లోకి పోయాడు. ఆఖరికి యిది ఆడు చావుకి వచ్చింది.

వెంకటేసు చచ్చి మూడు దినాలు కాలే రాయుడి మడుసులొచ్చారు! ఎదవలు యముళోళ్ళలా కన్పిస్తారు! ఆడిని పోలీటేషన్ నుంచి తేడానికి, ఆడి మందులకని బోలెడబ్బు అప్పిచ్చాడు రాయుడు. ఆడిలా మధ్యంతరంగా సస్తే ఎవడు తీరుస్తాడన్నారు. అంత బాధలో వచ్చిన యీ గండానికి గుండె గబిక్కుమంది ఆదెమ్మకు. ఏం చెయ్యాలో తెలీక సత్తిగాణ్ని పన్లోకి పెడతానంది. ఆమె కలలు ఆడి సదువు గంగలో కలిసిపోయాయి ఆ రోజునుంచి.

ఎందుకిలా అయిందో అర్థంకాదు బతుకెలా యీడవాలో తెలీదు. అమ్మా! దేవుడు దణ్ణమెట్టుకోవే, అమ్మోరుకు పొంగడాలెట్టవే,చీరిలా కట్టుకోవే అని చెప్పే అమ్మ యీ ఎదవ బతుకునెలా నెట్టాలో చెప్పిపోతే బావుణ్ణు! ఎప్పుడు ఎవరో చెబితే చెయ్య

డమే అలవాటు తనకు, తాను ఆలోచించడం ఏనాడూ తెలీదు. యీయాళ ఆయమ్మ మాట విన్నాక ఆలోచననొస్తాంది. యేదో పెద్ద మాయ, పెద్ద యిషపునాగు బతుకుల్ని చుట్టేసినట్టుంది తన కర్ధమవని ఏదో చక్రం తనలాంటి బతుకుల్ని తిప్పేస్తోంది అన్పించింది.

ఎక్కడో ఎవడో ఏదో చేస్తాడు- ఎక్కణ్ణుంచో ఏ తుఫానో వచ్చిపడిపోతుంది. మధ్యలో నలిగిపోయే బతుకులెన్నో! అంతా మనఖర్మ, మనకిలా రాసిపెట్టుంటే ఎవడేం చేస్తారనుకొంటాం. ఏవన్నా చెయ్యాల! ఏం చెయ్యాలో నాకెప్పుటికన్నా తెలిసేనా? నిరాశదిగులు ఆవరించాయి ఆదెమ్మని. యిలా ఏద్దైనా ప్రమాదంలో పోతే గవర్నమెంటు డబ్బిస్తదంటకానీ ఆడుపోయినట్టు ప్రమాదంలో పోలీసులకు చెప్పేదెవరు? తనెల్లి చెప్పినా రాయుడిమనుషులు పడనిస్తారా? యెళ్ళాలి! పెద్ద ఆఫీసరుకి జరిగింది చెప్పి న్యాయం చెయ్యమనాలి. పొదుపు సంఘంలో డబ్బు కూడ బెట్టుకొందిగా కాసిని డబ్బులు అప్పు తీసుకొని యెల్తుంది. ఏటో, శవం కావాలంటారు. శవపరీక్ష రిపోర్టు కావాలంటారు, పోలీసు రిపోర్టు కావాలంటారు. యివన్నీ అయితే కానీ ఆ డబ్బురాదు. యీటి కోసం తిరుగుతూ ఆఖరికి ఆడుపోయాడన్న బాధకూడా పడదానికి తనకు తీరకవ్వదేమో! సత్తిగాడిని ఆడు సారా పాకెట్లు జేబులో పెట్టుకుని బస్టాండులో అమ్మమంటున్నారట. ఆడు దొరికితే యిక తన గతేం గాను.

దేముడా! ఏటీ బాధలు. గుండె గుబగుబలాడింది.

మా బతుకుల్ని ఎందుకిలా ఎటూ గాకుండా చేస్తావు!

తేల్చుకోలేకపోతోంది.

యీ తుపానుల్ని తను ఆపగలదా? ఎవరికివాళ్ళు చెట్లు కొట్టుకపోతారా, యింత ఫళానా తుఫానేంటి తన బతుకు నీళ్ళపాలవ్వడమేంటి? కళ్ళు తుడుచుకొంది. రాత్రి చిక్కనౌతోంది ఆదెమ్మ ఆలోచనలా!

తెల్లారే బయల్దేరింది ఆదెమ్మ! ఎక్కడో ఒకక్కడ మొదలెట్టాలి.

పొదుపుసంఘంలో అప్పుతెచ్చి ఆ రాయుడి మొహానకొట్టి సత్తిగాడిని తెచ్చేయ్యాలి.

ఆ మధ్యాహ్నం మడమొక్కల్ని తెచ్చి బురద నీటిలో వరసగా నాటింది. ఆదెమ్మ పచ్చాకుల్తో నిండా కొమ్మల్తో బురదలోంచి గాలికోసం తన్నుకొని నిల్చే వేరుల్ని చూస్తూనే ఉందామె. ఆ ఆకులపై వెచ్చని సూర్యుని కిరణాలు మెరుస్తున్నాయి కొత్త ఆశల్లా.

# సమస్య - పరిష్కారం

**'నేను ఎక్కువగా డిప్రెషన్‌కు లోనౌతుంటాను'.ఎదుటి వ్యక్తులతో మాట్లాడాలంటే భయం వేస్తుంది...అందుకే ఒంటరిగా ఉంటాను...పరిష్కారం చూపండి.**

**బి.బి. శ్రీనివాస్**

మీ సమస్య చాలా సింపుల్, ఈ విషయంలో భయపడాల్సిన పని లేదు. ఏ విషయంలోనైతే మీరు డిప్రెషన్ కు లోనవుతున్నారో ఆ విషయాన్ని మీరు ఎక్కువగా ఆలోచించకండి. దాన్ని వదిలేసి మిగతా విషయాల్లో మీ మనసును కేంద్రీకరించండి. ఎదుటి వ్యక్తితో మాట్లాడదానికి మీరు ఇన్ఫిరీయారిటి కాంప్లెక్సుకు లోనౌతున్నారు. ఒంటరిగా వుండడంవల్ల మీలో ఆలోచన పెరిగి ఆందోళన పడ్తున్నారు. ఇదేమంత పెద్ద సమస్యకాదు.మీ కందుబాటులో వున్న డాక్టరును, సైక్రియాటిస్టను కలిసి మీ సమస్యను వివరించి తగిన ట్రీట్‌మెంట్ పొందండి.

-డాక్టర్. డి.సుశీలాదేవి.
సైక్రియాటిస్ట్

**నా వయసు 17 సంవత్సరాలు., ఇంటర్ సెకండియర్ చేస్తున్నాను....., డాక్టరుకు చెబుతామంటే సిగ్గుగా వుంది...., నా సమస్యకు తగిన పరిష్కారం చెప్పండి...?**

**ఒక సోదరి**

మీరు అనవసరంగా ఏదో ఊహించుకుని భయపడ్తున్నారు. మీ సమస్య చిన్నదే అయినా అవగాహనా లోపంవల్ల, మీకది పెద్దగా అన్పిస్తుంది,యుక్తవయస్సు వస్తున్న సమయంలో అమ్మాయిలకు ఇలాంటివి సహజం., ఏవో ఊహించుకుని బాధపడడం కంటే మీ అమ్మగారితో చెప్పి లేడీ డాక్టరును సంప్రదించి సరైన ట్రీట్‌మెంట్ తీసుకోండి.

- డాక్టర్. వనజాశ్రీవల్లి
గైనకాలజిస్ట్.

**జిల్లా ఫోరం లో వెలువడిన తీర్పు మీద ప్రత్యర్థి, రాష్ట్ర ఫోరంకు అప్పీలు చేయగా నావెర్షన్ అడిగితే సకాలంలో రిజిష్టర్డ్ లెటర్ ద్వారా పంపాను......,అయినా సమాధానం రాలేదు.నేను జాతీయ ఫోరంకు తెలియ చేసుకోవచ్చునా....?, ఎలాచేయాలి, తెలుపండి ?**

**ఎస్.మోహన్ రావ్. శ్రీకాకుళం**

మోహన్ రావు గారు! మీరు అడిగిన వివరాలు సరిగా లేవు. జిల్లా ఫోరం ఇచ్చిన తీర్పు మీద మీ ప్రత్యర్థి రాష్ట్రఫోరంలో అప్పీలు చేసినపుడు మీ వెర్షన్ సకాలంలో పంపించానన్నారు. అందులోని వివరాలు తెలియచేయలేదు ,మిమ్మల్ని వారేం అడిగారు?, మీ కేసు విషయంలో వారిచ్చిన నెంబర్‌ను కోట్ చేస్తూ ఫోరానికి పంపారా లేదా? తెలియ చేయలేదు., అలా చేయకపోతే , వెంటనే మరో లెటర్ వ్రాయండి. ఇకపోతే పని ఒత్తిడి వల్లనో, లేక ఇతర కారణాలవల్లనో మీకు రిప్లయ్ ఇవ్వడంలో జాప్యం జరిగి ఉంటుంది. అయితే కేసు వివరాలు తెలియచేస్తూ , మరోసారి జిల్లాఫోరానికి , రాష్ట్రఫోరానికి రిజిస్టర్డ్ పోస్ట్‌లో పంపవడి. 15 రోజులనుండి నెలరోజుల గడువులో మీకు రిప్లయ్ అందని పక్షంలో మీ కేసు విషయం తెలిసిన లాయర్ సహాయంతో జాతీయ ఫోరాన్ని సంప్రదించవచ్చు.

-టి.రాములు
రిటైర్డ్ హైకోర్ట్ న్యాయవాది.

**నేను పదవతరగతి ద్వితీయ శ్రేణిలో పాసయ్యాను.ఇంకా బాగా చదవాలని ఉంది, కానీ ఇంట్లో చదివించడంలేదు....., నా సమస్యను పరిష్కరించండి..!**

**జి.సతీష్. బెల్లంపల్లి**

మీ పరిస్థితిని పూర్తిగా వివరించలేదు.పదవతరగతి పాసయ్యారు కనుక , ఇంట్లో వారికి నచ్చచెప్పి , ఇంటర్ కోసం కాలేజీలో చేరండి., అలా వీలు కాని పక్షంలో మీ స్నేహితులు, బంధువు లెవరైనా ఉంటే వారిని సహాయం అడిగి సార్వత్రిక విశ్వవిద్యాలయం వారు నిర్వహిస్తున్న కోర్సుల్లో చేరి , మీ చదువును పూర్తి చేయండి., విష్ యూ ఆల్‌ది బెస్ట్.

-ఎస్. సూర్యప్రకాష్.
ఎడ్యుకేషనలిస్ట్ ,సైకాలజిస్ట్.

**బి సి ఏ కోర్సు చేసిన వారికి ఉపాధి గురించిన అవకాశాలు తెలియచేయండి ?**

**జి.రామక్రిష్ణ, చెన్నూర్ .**

బి సి ఏ కోర్సు చేసిన వారికి ఇపుడు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి, ప్రతిరోజు పేపర్లలో ఈ కోర్సు చేసిన వారిని తీసుకొంటామని ఎన్నో సంస్థలు ప్రకటిస్తున్నాయి. ఇంకా వివరాలకోసం డిసెంబర్ రెండవ తేదీ నుండి వార్త పత్రికలో జిల్లా ఎడిషన్ లో జాబ్స్ జాబ్స్ పేజీ చూడండి.

డి.సుధాంశ్ కుమార్
నిట్ కంప్యూటర్ ప్రోగ్రామర్.

## ప్రియపాఠకులారా! ఈ శీర్షిక మీదే!

**మీ సమస్య మానసికం, శారీరకం, వృత్తిసంబంధం, లీగల్, మెడికల్ ఏదైనా కావచ్చు. మీ సమస్యలకు అనుగుణంగా సంబంధిత రంగాలకు చెందిన ఆయా వృత్తి నిపుణులు సలహాలిస్తారు.**

**మీ సమస్యలు పంపవలసిన చిరునామా:**

పరిష్కారం,
'ఆదివారం వార్త'
డి.బి.ఆర్.మిల్స్‌రోడ్,
లోయర్‌ట్యాంక్‌బండ్, హైదరాబాద్ - 500 080